క్లుప్తంగా

కౌలు పత్రాలపై అవగాహన సదస్సు



చిలకలపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: పంట సాగుదారు హక్కు పత్రాలను ఏవిధంగా పొందాలి, యజమానులు వారికి ఏషరతులతో ఇస్తారనేదానిపై ఏఓ శ్రావణ్ ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. మండలంలోని చిలకలపల్లి, నూకలవాడలలో నిర్వహించిన సదస్సులలో ఏఓ శ్రావణ్ మాట్లాడుతూ యజమాని, సాగుదారు మధ్య ఉండే ఒప్పందం పత్రం ఇది అని తెలిపారు. దీని కాలపరిమితి 11నెలలు ఉంటుందని, పంట రుణాల అందుబాటు, పంటల బీమా ఉపశమనం, వడ్డీ పెట్టుబడి రాయితీ, రైతు భరోసా సాయం వంటి ప్రయోజనాలు కౌలు రైతులకు అందుబాటులోకి వస్తాయని తెలియజేశారు. దీనిని గ్రామ రెవెన్యూ అధికారి సంతకంతో ఇస్తారని, భూయజమాని పేరు, సాగుదారు పేరు, సర్వే నంబరు, పంట కాలం వంటి వివరాలు ఉంటాయని చెప్పారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిశోరీ బాలికలకు ఆహారం పంపిణీ



పెదపెంకిలో 7వ కేంద్రం వద్ద ఆహారం పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి, సర్పంచ్ పాపారావు

బలిజిపేట: కిశోరీ బాలికలకు (14నుంచి 18సంవత్సరాల లోపు) ఆహారం పంపిణీ కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రాల వద్ద గురువారం పంపిణీ చేపట్టారు. అందులో భాగంగా పెదపెంకిలో 7వ కేంద్రం వద్ద ఎంపీపీ నాగమణి, సర్పంచ్ పాపారావు చేతులమీదుగా ఆహారాన్ని కిశోరీ బాలికలకు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ కిశోరీ బాలికలు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అందుకుగాను ఐసీడీఎస్ శాఖద్వారా కేంద్రాల పరిధిలో వీటిని పంపిణీ చేస్తామన్నారు. బియ్యం 3కిలోలు, కందిపప్పు కిలో, నూనె అరలీటరు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీడీపీఓ సీహెచ్.సుగుణ, సూపర్‌వైజర్లు ఎస్.సులేఖ, పద్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


త్వరలో ప్రభుత్వ సాయం



బంటు జోగయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ జె.డి తిరపతయ్య

పాచిపెంట: మండల కేంద్రంలోని పెద్దగెడ్డ జలాశయంలో మే 19న చేపల వేటకు వెళ్లి మృతి చెందిన కేసలి పంచాయతీ మడవలస గ్రామానికి చెందిన బంటు జోగయ్య కుటుంబాన్ని గురువారం జిల్లా మత్స్య శాఖ ఉపసంచాలకుడు వేముల తిరుపతయ్య పరామర్శించారు. వైఎస్సార్ మత్స్యకార బీమా నుంచి రూ. 5 లక్షలు, వైయస్సార్ బీమా ద్వారా మరో ఐదు లక్షల రూపాయలు త్వరలో అందుతాయన్నారు. ఆయన వెంట మత్స్యశాఖ ఎ.డి కృష్ణమూర్తి , పెద్దగెడ్డ జలాశయం సొసైటీ ప్రెసిడెంట్ సుంకి జర్నీ, కొండలరావు, వైస్ ప్రెసిడెంట్ భూతాల గంగరాజు తదితరులు ఉన్నారు..

మత్స్య అవతారంలో జగన్నాథుడు



మత్స్య అవతారంలో జగన్నాథస్వామి

పాలకొండ: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి మత్స్య అవతారంలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వి.రాధాకృష్ణ భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వనాథందాస్ స్వామికి చోడాపచార పూజలు జరిపించారు.

బాలేరులో డ్రోన్ సర్వే



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

భామిని: మండలంలోని సొలికిరి రెవెన్యూ గ్రూప్ పరిధిలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, శాశ్వత భూసర్వేలో భాగంగా డ్రోన్ సర్వే గురువారం నిర్వహించారు. బాలేరు ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ సర్వేను ప్రారంభించారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్:

జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23వ తేదీనుంచి 'జగనన్న సురక్ష' క్యాంప్ అనే నూతన కార్యక్రమం ద్వారా గ్రామాల్లోకి పూర్తి స్థాయిలో ప్రభుత్వం, పార్టీ యంత్రాంగాన్ని ప్రజల వద్దకు పంపించి 9 అంశాలతో కూడిన ప్రభుత్వ పత్రాలను ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ, కుటుంబ ధృవీకరణ, వివాహ ధ్రువీకరణ, లావాదేవి మ్యుటేషన్లు, ఫోన్ నెంబర్‌కు ఆధార్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు వంటి ముఖ్యమైన పత్రాలను నేరుగా ప్రజల ఇంటి వద్ద నూతనంగా రూపొందించిన యాప్ నమోదు చేసుకొవచ్చునన్నారు. ప్రతిస్పందనలు నమోదు చేసుకొని వారి పత్రాలను సేకరించి టోకెన్ నెంబర్ ద్వారా వారి సమస్యను పరిష్కారం చేసేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. నియోజకవర్గ పరిధిలో నిర్వహించనున్న జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమంలో 3 మండలాలు, మున్సిపాలిటీ అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ప్రతీ ఒక్కరూ ప్రతీ సచివాలయం పరిధిలో తప్పక పాల్గొని ఈ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బి గౌరీశ్వరీ, వైస్ ఛైర్మన్ ఐ గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు బి రమేష్, బి చిట్టి రాజు, పి మురళీకృష్ణ, ఎంపీపీలు జి. నాగమణి, మజ్జి శేఖర్, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు మామిడి బాబ్జి, జేసీఎస్ కన్వీనర్లు, ఏఎల్‌ఓలు, అధికారులు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్, నియోజకవర్గ స్థాయి పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్యం

- ప్రతి నెలలో రెండుసార్లు వైద్యశిబిరాలు
- డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: గ్రామస్థాయిలోనే ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని వెంకంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచానపడివున్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్లవద్దనే వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు, కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సమస్యలు పరిష్కారం



పి.కోనవలసలో మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ తట్టికాయలు గౌరీశ్వరరావు

పాచిపెంట: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని మండల జేసీఎస్ కన్వీనర్ తట్టికాయల గౌరీశ్వరరావు అన్నారు. మండలంలోని విశ్వనాథపురం, పి.కోనవలస గ్రామ సచివాలయాల్లో విడివిడిగా ఆ గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష పథకం అమలుపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఏ సమస్యలున్నా నిర్దేశించిన వివిధ శాఖల అధికారులు వాటికి పరిష్కారం చూపుతారన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కొట్టిసి మంగ, గొర్ల సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు తోకల లక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గొర్ల గణపతి, మాజీ ఎంపీపీ కిర్ల రామకోటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండల అధ్యక్షుడు మాదిరెడ్డి మధుసూదనరావు, ఎంఎల్‌ఓ భరత్, గుణాపు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి : పీవో

సీతంపేట: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి అన్నారు. వివిధ గ్రామాల్లో ఉన్న పిల్లల దగ్గరకు పీవో గురువారం స్వయంగా వెళ్లి చైతన్యం చేశారు. మొత్తం 14 మంది డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకున్నారు. కుడ్డపల్లి గ్రామంలో ఆరుగురు, కిల్లాడలో 4, పూనుపేటలో నలుగురు విద్యార్థులను గుర్తించి పాఠశాలలో ప్రవేశం కల్పించారు. తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలల్లో చేరడం వలన ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ఉద్యోగవకాశాల గూర్చి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో చదువు మధ్యలో మానొద్దని సూచించారు. ఇంకా గ్రామాల్లో ఎవరైన డ్రాపౌట్లు ఉంటే వెంటనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఎ.లిల్లీరాణి, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, సీఎంవో చిరంజీవులు పాల్గొన్నారు.

సింగన్నవలసలో ఫ్యామిలీ డాక్టర్

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగుల ఇంటికి వెళ్లి వారికి కావాల్సిన మందులు అందించడంతో పాటు ఆరోగ్య సలహాలు అందించారు. ఆయనతో పాటు ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమాతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి శ్రీనివాసరావు

సీతానగరం: పశువుల పెంపకం దారులకు ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ పశు బీమాపథకం ద్వారా బహుళ ప్రయోజాలున్నాయని జిల్లా పశుసంర్థకశాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలం కాశీపేటలో గురువారం వైఎస్సార్ పశుబీమా పథకంపై పశువుల పెంపకం దారులకు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పశుసంవర్థక అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాణిజ్యపరంగా పాడి వ్యాపారం చేస్తున్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు పశువులను, ఇతర జంతువులను పెంపకం చేస్తున్నారన్నారు. అవి ఏకారణం చేతనైనా మృతి చెందితే కాపరుడు లేదా రైతు ఆర్థికంగా నష్ట పోయేవారని, ఈ నేపథ్యంలో పెంపకం దారుల ఆర్థిక ఇబ్బందులను గమనించిన జగనన్న ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు వైఎస్సార్ పశుబీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలియజేశారు.

ఆరోగ్య పరిరక్షణపై సూచనలు

ఏదైనా ప్రమాదం వల్ల కానీ, సాధారణంగా మృతిచెందినా బీమా పథకం వర్తించేవిధంగా చర్యలు చేపట్టిందన్నారు. రూ 30 వేల విలువైన పశువుకు మూడు సంవత్సరాల కాలం బీమా వర్తించడానికి ప్రీమియం రూ.397, గొర్రెలు, మేకలు, పందులకు ఏడాదికి రూ.26 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో పాడిపశువుల పట్ల రైతులు తీసుకుంటున్న జాగ్రత్తలు తెలుసుకుని, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై తెలియజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎ.డిలు డాక్టర్ సీహెచ్ దీనకుమార్, ప్రసాద్, బి.చక్రధర్, జై.కిరణ్, మండల పశువైద్యాధికారి డాక్టర్ రామారావు, జెడ్పీ మాజీ సభ్యుడు టి.వెంకటప్పలనాయుడు, సర్పంచ్ టి ధనుంజయమ్మ, పీఏసీఎస్ ఛైర్మన్ బి.ధనుంజయ్, టి.శ్రీనివాసరావు, ఎం. ప్రభాకర్ పాల్గొన్నారు.

జీసీసీ పురోభివృద్ధే లక్ష్యం

- జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్



గుమ్మలక్ష్మీపురం ఇండేన్ గ్యాస్ గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న జీసీసీ డీఎం వి.మహేంద్ర కుమార్

గుమ్మలక్ష్మీపురం:

గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పురోభివృద్ధికి కృషి చేయాలని పార్వతీపురం డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ పరిధిలోని ఇండేన్ గ్యాస్ గొడౌన్, ఎంఎల్ఎస్ స్టాక్‌పాయింట్, పెట్రోల్ బంకును గురువారం పరిశీలించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది డివిజన్ పరిధిలో రూ.53.33 కోట్లు విలవ చేసే వ్యాపారలావాదేవీలు నిర్వహించాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.7.83 కోట్ల విలువైన వ్యాపారం చేశామన్నారు. జూన్ నెల పూర్తయ్యేలోగా మరో రూ.4 కోట్ల మేర వ్యాపారలావాదేవీలు జరుగుతాయని తెలిపారు. అటవీ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ అమ్మకాలు పెంచుతామని తెలిపారు. కొత్తగా గ్యాస్ గొడౌన్‌లు, పెట్రోల్ బంకుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపడంతో పాటు జీసీసీ ద్వారా వ్యవసాయ రుణాలు మంజూరు చేపట్టనున్నట్టు వెల్లడించారు. జూలై నుంచి డివిజన్ పరిధిలోని 3 ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్లు (కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు)నుంచి నిత్యావసర సరుకులు తమ వాహనంతోనే సరఫరా చేస్తామన్నారు. అనంతరం సేల్స్‌మేన్లు, డీలర్లతో మాట్లాడుతూ ప్రతిరోజు సమయానికే డిపోలు తెరవాలని, గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట జీసీసీ సిబ్బంది సాంబశివరావు, అకౌంటెంట్ గణపతిరావు, సంగమేష్ ఉన్నారు.

వేగవంతంగా గృహ నిర్మాణాలు

సీతంపేట: గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. పాలకొండ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన హౌసింగ్ ఏఈలతో ఆమె చాంబర్‌లో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షించాలన్నారు. ఇంకా ప్రారంభించని గృహనిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించాలన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు



అప్పయ్యపేటలో మస్తరు వెరిఫికేషన్ చేస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో అర్హులైన వారందరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని అప్పయ్యపేట గ్రామం సమీపంలో వేతనదారులు చేస్తున్న పనులను, మస్తరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న వారందరికీ ఉపాధిహామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. వేతనదారుల సమగ్ర సమాచారంతో మేట్‌లు గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంతో పేదలందరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. అలాగే చెరువుల్లో పనులు చేసే సమయంలో మట్టిని గట్లపై వేయాలని నీరు విడుదల చేసే సమయాల్లో మదుముల ద్వారా నీరు మళ్లించే విధంగా మట్టిని వేయాలని సూచించారు. ఆయకట్టు భూములున్న వారిలో కొంతమంది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని, చెరువుపనులు బాధ్యతగా చేయాలని కోరారు. కార్యక్రమంలో పెదభోగిలి సచివాలయం కమిటీ కన్వీనర్ బి. సూర్యనారాయణ, ఉపాధిహామీ పథకం సహాయసంచాలకులు, క్షేత్ర సహాయకులు, మేట్‌లు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నదీతీరాన వేంచేసిన వేణుగోలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి గురువారం స్వామివారిని ఆలయప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో సహచర అర్చకుల సహకారంతో స్వామివారిని వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో అలంకరిస్తామని తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులంతా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అభిషేకాలు, ముడుపులు చెల్లిస్తారన్నారు. గృహదోషాలు, కుటుంబకలహాలతో ఇబ్బందులు పడుతున్న వారు తమ సమస్యలు తీరుతాయన్న నమ్మకంతో పూజలు చేస్తారని తెలిపారు. దూరప్రాంతాలనుంచి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేస్తామన్నారు.

మాతా,శిశు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు

- డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: మాతా,శిశు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా ఆరోగ్య కార్యాలయంలో గురువారం ఆయన ఆశ నోడల్ అధికారులకు(సూపర్‌వైజర్స్) పలు ఆరోగ్య కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గర్భిణీ నమోదైన నాటి నుంచి ప్రసవించిన తర్వాత కొన్ని రోజుల పాటు వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని, గర్భిణులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షలు, తనిఖీలు అనంతరం అసాధారణంగా గుర్తించిన పారా మీటర్స్‌పై దృష్టి సారించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రగతి నివేదికల వారీగా సమీక్ష జరిపి సిబ్బందిని ఆరా తీశారు. గర్భిణుల నమోదు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీ మ్యాపింగ్, మొదటి త్రైమాసిక గర్భిణుల నమోదు, ఆరోగ్య పరీక్షలు, హై రిస్క్ గర్భిణులను గుర్తించడం , పర్యవేక్షణ, గర్భిణులకు టీడీ టీకా రెండు డోసులు, ఐరన్ మాత్రల పంపిణీ, వాటి వివరాలు, ఈ–ఆశ అప్లికేషన్‌లో ఈసీ, హెచ్‌బీవైసీ, హెచ్‌బీఎన్‌సీ ఆరోగ్య వివరాల నమోదు, ఐదు సంవత్సరాల లోపు పిల్లల హెల్త్ స్క్రీనింగ్ వివరాలు అప్‌లోడ్, గర్భిణుల సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలు నిర్ణీత సమయంలో అప్‌లోడ్ చేయడం తదితర అంశాలపై సమీక్ష చేసి వైద్యసిబ్బంది ఏ మాత్రం అశ్రద్ధ చూపినా తగుచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పర్యవేక్షణ ఉండాలి

అనంతరం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ప్రసవ సమయ దగ్గర పడుతున్న కొద్దీ గర్భిణుల ఆరోగ్యంపై మరింత పర్యవేక్షణ ఉండాలని తద్వారా ఏ చిన్న ప్రమాదకర సూచనలు ఉన్న గుర్తించి నివారించడం వల్ల ముందస్తు జాగ్రత పడవచ్చని సూచించారు.

వరివిత్తనాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ప్రైవేట్ వర్తకుల డిపోల్లో విత్తన శాంపిల్స్ తీస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: ఖరీఫ్‌సీజన్‌లో మండల రైతులకు ప్రైవేట్ వర్తకులు సమకూర్చనున్న విత్తనాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని ప్రైవేట్ వరివిత్తనాల విక్రయ డిపోలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కొన్నిరకాల వరివిత్తనాలు రైతు భరోసా కేంద్రాలద్వారా సరఫరా చేస్తుందని తెలియజేశారు. అలాగే ప్రైవేట్ డీలర్లు నిబంధనలకు లోబడి, నాణ్యతా ప్రమాణాలతో కూడిన విత్తనాలు సమకూర్చాలని కోరారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో వరివిత్తనాలు విక్రయించే డిపోలలో నిల్వ ఉన్న వరి విత్తనాల నాణ్యత తనిఖీ కోసం శాంపిల్స్ తీసినట్లు చెప్పారు. మండలంలో వరియదలు వేయడానికి రైతులు సమాయత్తం కావడం వల్ల వారికి అవసరమైన విత్తనాలు సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విత్తన విక్రయదారులు, పలుగ్రామాల రైతులు పాల్గొన్నారు.

సక్రమంగా రిజిస్ట్రేషన్లు

పాలకొండ: సచివాలయాల్లో భూ రిజిస్ట్రేషన్‌లు సక్రమంగా చేయాలని జేసీ గోవిందరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన మండలంలోని సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్‌ల తీరు పరిశీలించారు. సాంకేతిక సమస్యలున్నట్లు గుర్తించిన ఆయన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిశీలన చేశారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు తహసీల్దార్ పి.సోమేశ్వరరావుకు సూచనలు అందించారు. సచివాలయాల్లో పక్కాగా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ చేయాలని తెలిపారు.

జంఝావతి పెండింగ్ పనులు చేపట్టాలి

- వెంకటాపురం రైతుల వినతి

సీతానగరం: జంఝావతి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేసి నిర్దేశించిన భూములకు సాగునీరు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వెంకటాపురం (కామందొరవలస పంచాయతీ) రైతులు పంచాయతీ కార్యదర్శి లక్ష్మికి గురువారం వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.అప్పలనాయుడు, రైతు నాయకులు బి.గౌరునాయుడు, బి.గోపాలకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ జంఝావతి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయకపోవడంతో ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చేందుకు సంతకాల సేకరణ చేశామని అయినా రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జంఝావతి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని కోరారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు